క్లుప్తంగా

మహిళల హక్కుల కోసం పోరాటం

ధర్పల్లి: నేటి సమాజంలో స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాటం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. దుబ్బాకలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) 8వ జిల్లా మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలకు పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు హాజరై అధ్యక్షత వహించారు. భాస్కర్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ప్రవేశపెట్టినా, అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయన్నారు. అనంతరం పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర మాట్లాడుతూ.. పురుషులతో పాటు మహిళలకు సమాన గౌరవాన్ని ఇవ్వాలని కోరారు. పీవోడబ్ల్యూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు జయ, సవిత, జ్యోతి, అనిత, గంగామణి, లత, రాధ పాల్గొన్నారు.

కులాల అభివృద్ధిలో ఉద్యోగులు కీలకం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలో ఉన్న ఆయా కుల సంఘాల అభివృద్ధిలో ఉద్యోగుల కృషి ఎంతగానో ఉందని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు వ్యాఖ్యానించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడ్ల నాగరాజు ఎన్నికైన సందర్భంగా ఆదివారం మాల విద్యుత్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల సంఘాలు అభివృద్ధి చెందాలంటే ఉద్యోగుల సాయ సహకారాలు చేయటం కీలకమన్నారు. ప్రతి ఒక్కరు ఈ దిశగా కృషి చేయాలన్నారు. నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సెక్రటరీ అశోక్ కుమార్, సలహాదారులు పోశెట్టి, కైలాస్ కుమార్ కార్యవర్గ సభ్యులు గంగాధర్, సోమేశ్, సంజీవ్, కాంతారావు పాల్గొన్నారు.

కార్యకర్తలపై కేసులు ఎత్తేయండి

సుభాష్‌నగర్: ఎన్నికల మేనిఫెస్టో మేరకు ఇంటికో ఉద్యోగమివ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి కేటీఆర్‌ను అడ్డుకున్నందుకు బీజేవైఎం కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు ఆదివారం డిమాండ్ చేశారు. యువమోర్చా కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జీ చేసి, రిమాండ్‌కు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. హామీలు అమల్జేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు.

చైర్‌పర్సన్‌కు మద్దతు తెలిపిన పద్మశాలి మహిళలు



నిజామాబాద్‌నాగారం : జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి మహిళా విభాగం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, కార్యదర్శి అమరవిక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు గుడ్ల చంద్రబాగ, ఉపాధ్యక్షులు కొండి సుధ కలిసి మద్దతు తెలిపారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. బీసీ సోదరికి అవమానం భరించలేక తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. శ్రావణి కంటతడి బీసీలను కదిలించిందన్నారు. అధిష్ఠానం చొరవ తీసుకొని బోగ శ్రావణిని చైర్మన్ పదవిపై కూర్చోబెట్టి తగిన న్యాయం చేయాలన్నారు. ఆమెకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా తెలంగాణ వ్యాప్తంగా మహిళలు అండగా ఉంటారన్నారు.

'దళిత బంధు'లో ప్రాధాన్యత ఇవ్వాలి

నిజామాబాద్‌నాగారం: దళిత బంధులో కేవలం మాల, మాదిగలకే కాకుండా దళితుల్లో ఉప కులాలైన 57 కులాల వారికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజలింగం అన్నారు. ఆదివారం నగరంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతీ నియోజక వర్గంలో ఇచ్చిన వంద మందిలో ఒక్క ఉప కులానికి చెందిన వారికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మా(30 లక్షల) ఉపకులాల ప్రజలపై దృష్టి సారించాలన్నారు. దళిత బంధులో తమిళనాడు తరహాలో 3 శాతం ప్రత్యేక జీవో జారీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు

- ఆర్మూర్ పట్టణంలో గుంపులుగా తిరుగుతూ వెంటపడుతున్న వైనం
- బయటకు వెళ్లాలంటే భయపడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్ పట్టణంలోని ఓ వీధిలో తిరుగుతున్న కుక్కలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. రోజు కొక కాలనీలో కుక్కల బారిన పడి ప్రజలు ఆస్పత్రి పాలవుతున్న సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బయటకు వెళ్లే ప్రజలపై కుక్కలు దాడి చేస్తున్నాయి. చిన్నారులు ఆరు బయట ఆడుతున్న సమయంలో సైతం కుక్కలు దాడి గాయపరుస్తున్నాయి. కుక్క కాటు వల్ల బాధితులు ఆస్పత్రుల చుట్టూ ఇంజక్షన్ల కోసం వెళ్లడం పరిపాటిగా మారింది. పుర ప్రజలు ఎంత మొతుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నుంచి ప్రజలు రక్షించాలని కోరుతున్నారు.

- వారం రోజుల క్రితం ఔటిగల్లీలో అర్ష అనే బాలుడి చేతిని కుక్క కరిచింది.
- గోలబంగ్లా వద్ద సిద్ధ అనే బాలుడిపై కుక్క దాడి చేసి కాలుకు గాయం చేసింది.

వెంటపడి కరుస్తున్నాయి



కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. ఎక్కువగా పిచ్చి కుక్కలే గుంపుగుంపులుగా తిరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. త్వరగా కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి. – రాజు, ఆర్మూర్

బయటకు తరలించాలి



మున్సిపల్ అధికారులు కుక్కలను కాలనీ నుంచి తరలించాలి. కుక్కల దాడిలో చిన్నారులు గాయాలపాలవుతున్నారు. ఉదయం వాకింగ్ వెళ్తున్న సమయంలో సైతం వెంటపడి దాడిచేస్తున్నాయి. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలి. – శ్రీధర్, ఆర్మూర్

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న అధికారులు



కొత్తగా వేస్తున్న రహదారి



రోడ్డు వేసుకుంటున్న మొరం వ్యాపారులు

మాక్లూర్: మాదాపూర్‌లోని 10వ వార్డు ప్రజలకు ఈ నెల 27న తహసీల్దార్ శంకర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మొరం వ్యాపారులను రప్పించి ఏం చేస్తారో తనకు తెలియదని, కాలనీ మధ్య నుంచి వెళ్తున్న మొరం టిప్పర్ల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదని గట్టి వార్నింగ్ ఇచ్చారు. అంతే కాదు భవిష్యత్తులో మీపై ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని చెప్పారు. దీంతో మొరం వ్యాపారులు ఆగమేఘాల మీద రహదారిని మరో ప్రాంతం నుంచి వేసుకుంటున్నారు. పనులను కూడా ఆదివారం ప్రారంభించారు. రాత్రి పగలు తేడా లేకుండా నడుస్తున్న భారీ మొరం టిప్పర్ల ద్వారా నివాసాల్లోనికి దుమ్ము, ధూళి చేరి అనారోగ్యాల పాలవుతున్నామంటూ ఈ నెల 27న రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా తహసీల్దార్ శంకర్, ఎస్సై యాదగిరిగౌడ్ అక్కడికి చేరుకొని తగిన హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు. ఇచ్చిన హామీ మేరకు రోడ్డును మరో ప్రాంతం నుంచి వేయిస్తున్నారు.

గోవుల సంరక్షణ కోసం గోశాల ఏర్పాటు



గోవులకు చికిత్స చేస్తున్న వైద్యులు.. పక్కన బజరంగ్‌దళ్, హిందూ సంస్థల నేతలు

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో ఆదివారం ఉదయం దేవాలయాలకు సంబంధించిన ఆవులను ఎత్తుకెళ్లడంతో బజరంగ్‌దళ్, హిందు సంస్థల యువకులు, సర్పంచ్, ఎంపీటీసీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడే సమావేశం నిర్వహించి ఆవులను రక్షించడం కోసం గోశాలను నిర్మించాలని, గ్రామంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మత్తు మందు ఇచ్చిన ఆవులకు వెటర్నరీ వైద్యుల ద్వారా చికిత్స అందించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు, గోశాలకు జీపీ నుంచి రూ.లక్ష కేటాయించినట్లు సర్పంచ్ ఆకుల మాధవి తెలిపారు. దొంగతనాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తీర్మానించి ఎస్సై పాండే రావు దృష్టికి తీసుకువచ్చారు. ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, హిందూ సంఘాల నేతలు న్యావనంది శ్రీకాంత్, సాయికుమార్, శ్రీధర్ గౌడ్, సాయి చంద్ర, నివాస్ యాదవ్, పవన్ కుమార్, రాజు, గంగా శంకర్, సురేష్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి లయన్స్ క్లబ్‌కు అవార్డులు



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట పండింది. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన 35 క్లబ్బులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎడపల్లి లయన్స్ క్లబ్‌కు 13 అవార్డులు దక్కాయి. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320డి రీజనల్ కాన్ఫరెన్స్ కార్యక్రమం బోధన్‌లోని రవి గార్డెన్‌లో జరిగింది. ఈ మేరకు ఎడపల్లి మండలంలో చేపట్టిన ఉత్తమ సేవలకుగాను క్లబ్‌కు 13 అవార్డులు దక్కాయి. క్లబ్ ప్రతినిధులు కదం ప్రకాష్ రావు, కాశీనాథ్, సుభాష్, మనోజ్, కరటూరి సూర్యనారాయణలు అవార్డులు తీసుకున్నారు.

'ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తాం'



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నాయకులు

బోధన్ : బోధన్ ప్రత్యేక జిల్లా సాధన కోసం దశలవారీగా చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని న్యాయవాదులు తెలిపారు. అన్ని అర్హతలున్న బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఆదివారం నాటికి 42వ రోజుకు చేరాయి. దీక్ష చేపట్టిన విద్యార్థి జేఏసీ, బీఎస్పీ నాయకులు శివకుమార్, రాంచందర్, అన్వర్ అలీ, ఖైసర్‌లు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ దీక్షలను ప్రారంభించారు. న్యాయవాదులు హన్మంత్‌రావు, శంకర్, అర్జున్ రండార్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఎల్లయ్య సేవలు మరువలేనివి



మాక్లూర్ : కొత్త ఎల్లయ్య సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సీపీఐలో ఉంటూ పేదల కష్టాలే తన కష్టాలుగా భావించి ఎన్నో సేవలు చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆదివారం కొత్తపల్లిలో జరిగిన ఎల్లయ్య మొదటి వర్ధంతి కార్యక్రమానికి సుధాకర్ హాజరై మాట్లాడారు. ముందుగా ఎల్లయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లయ్య స్ఫూర్తితో సమస్యలపై ప్రతి సీపీఐ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంజర భూమయ్య, కమలాపురం రాజన్న, నాగం సాయిలు, వెంకటేశ్వర్లు, చందు, కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సాధనకు ఉద్యమించాలి



బోధన్‌లో భవన నిర్మాణ రంగ కార్మికుల ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

బోధన్: సంక్షేమ పథకాల సాధన కోసం భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికులు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మల్లేష్ అన్నారు. కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫిబ్రవరి 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా తలపెట్టామని పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అర్హులైన భవన నిర్మాణ రంగ కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.6 వేల ఫించన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు సహజ మరణానికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.లక్షా 30 వేల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీఎం కేసీఆర్ మాట తప్పారు



కోటగిరి: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు రూ.3 వేలకు నెలసరి వేతనం పెంచుతామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించి మాట తప్పారని, అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకుని కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ.. ఏజెన్సీ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని పేర్కొన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నన్నే సాబ్, ప్రతినిధులు నీరడి భూమయ్య, కార్మికులు రమణమ్మ, ఉషారాణి, పుష్ప, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



ఆలూర్‌లో గంగా జలాలతో ఊరేగింపు..



ఆర్మూర్‌లో జలాభిషేకం చేస్తున్న సర్వ సమాజ్ సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతం నుంచి తీసుకు వచ్చిన గంగా జలాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి డైరెక్టర్ ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లేష్, సొసైటీ చైర్మన్ కళ్లెం భోజా రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు బార్ల గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ప్రజా ఐక్య సమితి సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు సంక్రాంతి తరువాత వచ్చే మొదటి అమావాస్య తర్వాత గ్రామ దేవతలకు జలాభిషేకం చేయడం అనేది ఆనవాయితీగా వస్తుందన్నారు. గంగానీటిని తీసుకువచ్చి గ్రామ శివారు నుంచి డప్పు వాయిద్యాల మధ్య గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. సర్వ సమాజ్ సభ్యులు, ఆరు పంతల సదార్లు, ఇతర కులాల సంఘ సభ్యులు పాల్గొన్నారు

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

బీజేపీ నేత వ్యాఖ్యలపై ఆందోళనలు



రుద్రూర్‌లో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు..



వర్నిలో రాస్తారోకో చేస్తున్న నేతలు



కోటగిరిలో దిష్టిబొమ్మ దహనం చేస్తూ..

రుద్రూర్/వర్ని/కోటగిరి: బాన్సువాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌పై బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం వర్ని, రుద్రూర్, కోటగిరి మండలాల్లో దళిత సంఘాల నాయకు ల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ధర్నా లు, రాస్తారోకోలు చేసి మాల్యాద్రి రెడ్డి దిష్టిబొమ్మల ను దహనం చేశారు. దళిత మేధావులపై జరిగే దా డులను ఖండించాలని నినాదాలు చేశారు. కోటగిరి హైస్కూల్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై జరిగిన ఘటనను మరవక ముందే శ్రీనివాస్ ప్రసాద్‌పై అ నుచిత వ్యాఖ్యలు చేసి మానసిక క్షోభకు గురి చేస్తున్నారని నాయకులు అన్నారు.

నరేంద్రకు ఘన నివాళి

నిజామాబాద్‌నాగారం: జర్నలిస్టు మల్లెపూల నరేంద్ర 32వ వర్ధంతిని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. నరేంద్ర చిత్రపటానికి ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజలింగం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తే దైవంగా భావించి ప్రాణాలు సైతం లెక్క చేయకుండా వార్తల సేకరణకు వెళ్లిన నరేంద్ర జర్నలిస్టుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. జర్నలిస్టు వృత్తే కత్తి మీద సాములాంటిందన్నారు. అలాంటి వృత్తిలో మనం సమాజ శ్రేయస్సు కోసం తన వంతుగా కృషి చేయాలన్నారు. నరేంద్ర స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కథనాలు రాసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. జర్నలిస్టు బొబ్బిలి నర్సయ్య పాల్గొన్నారు.

వైభవంగా చలి బోనాల పండగ



పోచమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో, బషీరాబాద్‌లలో ఆదివారం చలి బోనాల పండుగ వైభోపేతంగా జరిగింది. గ్రామస్తులు ఒకరోజు ముందు వండిన అన్నం, బెల్లపన్నం, పెరుగు, పుట్నాలు, బెల్లం, కూరతో కూడిన బోనాన్ని నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి శివారులోని ఊళ్లే పోచమ్మ, ఐదుచేతుల పోచమ్మ, తాతాయి దేవాలయాలకు వెళ్లారు. అక్కడ పోచమ్మ దేవతకు పసుపు కుంకుమ, బుక గులాలు చల్లి, పసుపు ఆకులో నైవేద్యాన్ని ఉంచి, ఈతకల్లుతో బోనం సమర్పించుకున్నారు. భక్తులు పోచమ్మను చిలుక గుర్రం ఎక్కించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పసుపు ఆకుల్లో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బోధన్ లయన్స్ క్లబ్ సేవలు భేష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ బాబూరావు

బోధన్: సామాజిక సేవల్లో బోధన్ రీజియన్ పరిధిలోని లయన్స్ క్లబ్‌లు అగ్రస్థానంలో నిలిచాయని లయన్స్ డిస్ట్రిక్ అడ్వైజర్ డాక్టర్ బాబూరావు అభినందించారు. ఆదివారం పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ 9, 10వ రీజియన్ పరిధిలోని లయన్స్ క్లబ్‌ల రీజనల్ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన లయన్స్ డిస్ట్రిక్ మొదటి గవర్నర్ లక్ష్మి, మాజీ గవర్నర్ బసవేశ్వర్ రావు, కాన్ఫరెన్స్ చైర్మన్ కొడాలి కిషోర్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబురావు మాట్లాడారు. క్లబ్‌ల సేవా కార్యక్రమాలను గుర్తించి 35 క్లబ్‌లను ఎంపిక చేసి అవార్డులను ఆ క్లబ్‌ల ప్రతినిధులకు అందించారు. లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు చక్రవర్తి, శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణ, కృష్ణ మోహన్, శ్రీనివాస్, ఆదినారాయణ పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డులు అందుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏసీడీ బిల్లులు చెల్లించం



విద్యుత్ ఏఈతో మాట్లాడుతున్న కాలనీ వాసులు

బోధన్‌టౌన్(బోధన్): ఇంటి విద్యుత్ బకాయితో పాటు విద్యుత్ శాఖ అదనంగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఏసీడీ బిల్లులు చెల్లించలేమని పట్టణంలోని 13వ వార్డులోని చెక్కి క్యాంప్ కాలనీవాసులు విద్యుత్ అధికారులకు తేల్చి చెప్పారు. విద్యుత్ బిల్లుల వసూలు కోసం కాలనీకి వచ్చిన విద్యుత్ శాఖ అధికారులతో కాలనీవాసులు ఏసీడీ బిల్లు చెల్లింపు విషయమై ప్రశ్నించారు. విద్యుత్ బిల్లుతో పాటు అదనంగా ఏసీడీ బిల్లు చెల్లించడం ఏంటని విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ బిల్లులతో పాటు ఏసీడీ బిల్లు చెల్లించాల్సిందేనని విద్యుత్ అధికారులు కాలనీవాసులకు తేల్చి చెప్పారు. దీంతో కాలనీ వాసులు విద్యుత్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఏసీడీ బిల్లు చెల్లించబోమని అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో విద్యుత్ అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు.